క్లుప్తంగా

నాడు-నేడు పనుల పరిశీలన



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య తదితరులు

సోమల: మండలంలోని నంజంపేట ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకం కింద రూ.24 లక్షల వ్యయంతో చేపట్టిన నిర్మాణాల పనులను ఎంపీపీ ఈశ్వరయ్య, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రధానోపాధ్యాయిని కుసుమాంబ విజ్ఞప్తి మేరకు పాఠశాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, సర్పంచ్ వెంకటరెడ్డి, ఏఈ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కడపనత్తం విద్యార్థులు



విద్యార్థినులతో ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లె : మండలంలోని కడపనత్తం జెడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్ బాల్ టోర్నీకి ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు నందగోపాల్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అండర్-14, 17 విభాగాల్లో పాఠశాల విద్యార్థినులు సుప్రియ, నందిని, మధుమతి పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థినులను పీడీ చిరంజీవి అభినందించారు.

'పరీక్షా పే చర్చా'లో కరసనపల్లె విద్యార్థి



ప్రధానమంత్రి నరేంద్రమోదీతో రాకేష్

పెద్దపంజాణి : ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం న్యూఢిల్లీలో పరీక్షా పే చర్చా కార్యక్రమానికి కరసనపల్లె జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి రాకేష్ హాజరయ్యాడు. శనివారం ఈ మేరకు ప్రధానోపాధ్యాయిని రుద్రాణి మాట్లాడుతూ ప్రతిష్టాత్మక కార్యక్రమం అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ ఆధ్వర్యంలో జరిగిన తేనీటి విందులో సైతం రాకేష్ పాల్గొన్నట్లు వెల్లడించారు. విద్యార్థిని ఎంఈఓ హేమలత, సర్పంచ్ శిరీష, ఉపాధ్యాయులు అభినందించారు.

లాలాజీకి ఘన నివాళి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ గంగాధరం నాయుడు

సోమల: స్థానిక ఎస్‌కేవీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లాలా లజపతిరాయ్ 158 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ గంగాధరం నాయుడు మాట్లాడుతూ సైమన్ కమిషన్‌ను వ్యతిరేకిస్తూ లాలా లజపతిరాయ్ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి జయరామ్, అధ్యాపకులు బట్టు శివయ్య, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నేరం



మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి

బైరెడ్డిపల్లె : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి తెలిపారురు. శనివారం కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. శ్రీదేవి మాట్లాడుతూ యుక్త వయసు వచ్చిన తర్వాతే పెళ్లి చేసుకోవడం క్షేమకరమని సూచించారు. ఎవరైనా బలవంతంగా మైనర్లకు వివాహం చేస్తే 1098 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. అలాగే పాతపేట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కింద వైద్యాధికారి విజయ్‌చంద్ర పలువురు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

శ్మశాన వాటిక పరిశీలన



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: మండలంలోని బట్టందొడ్డి పంచాయతీలో ఎస్సీలకు కేటాయించిన శ్మశాన వాటికను ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్ శనివారం పరిశీలించారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీల శ్మశాన వాటికలను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్వేయర్ ఉదయ్ కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెంకటేగౌ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ నేతలు



లబ్ధిదారుకు సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం

- పేదల అభ్యున్నతే లక్ష్యం
- అర్హులందరికీ పథకాలు
- 98శాతం హామీల అమలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్

గంగవరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమానికి తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. శనివారం మండలంలోని మేలుమాయి, కొత్తూరు, గుండ్లపల్లె, ఎస్సీ కాలనీ, చిన్నమనాయనిపల్లెలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్న పథకాల్లో భాగంగా ఎన్నికల హామీలను 98శాతం నెరవేర్చి జనం గుండె చప్పుడుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశేష ఆదరణ పొందుతున్నారని కొనియాడారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే మన రాష్ట్రం తొలిస్థానంలో ఉందన్నారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని వెల్లడించారు. 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబుకు ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకువస్తారని, వందలకొద్దీ హామీలు గుప్పిస్తారని, తర్వాత వాటిని గాలికి వదిలేస్తారని విమర్శించారు. వ్యవసాయ రుణాల మాఫీ పేరుతో రైతులను మోసం చేశారని, పసుపు-కుంకుమ పేరుతో డ్వాక్రా అక్కచెల్లెమ్మలను మభ్య పెట్టారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని తెలిపారు. మాయమాటలు చెప్పి జనజీవితాలతో ఆడుకునే చంద్రబాబు ఏ ముఖం పెట్టుకుని ఓట్ల కోసం వెళతారని మండిపడ్డారు. జగనన్న అందిస్తున్న సుపరిపాలనను దృష్టిలో ఉంచుకుని ప్రజలు మళ్లీ వైఎస్సార్‌సీపీకే మొగ్గుచూపుతున్నట్లు వివరించారు.

విపక్షాల అసత్య ప్రచారం

శాంతిపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అడ్డుకునేందుకే విపక్షాలు అసత్యప్రచారానికి తెరతీస్తున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ భరత్ స్పష్టం చేశారు. శనివారం చెంగబళ్ల పంచాయతీ శివకురుబూరు, వడ్డివానికొత్తూరులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నపై ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా బురదజల్లేందుకు యత్నిస్తున్నాయని ఆరోపించారు. 2014 ఎన్నికల సమయంలో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు, అధికారంలోకి రాగానే మేనిఫెస్టోనే మాయం చేశారని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ మాయమాటలు వల్లించేందుకు జనం ముందుకు వస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వసుంధర, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు చంగప్ప, కృష్ణమూర్తి, సుకుమార్, స్థానిక నేతలు కోదండరెడ్డి, వినోద్, సుబ్బన్న, సర్పంచ్ పూలకుంట భాస్కర్, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

మేలుమాయి గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వార్డు మెంబర్ జ్యోతి, స్థానిక నేతలు బాలాజీ, ముత్యాలు, సుబ్రమణ్యం, ప్రకాష్ తమ కుటుంబాలతో కలిసి టీడీపీకి గుడ్‌బై చెప్పేశారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గత టీడీపీ హయాంలో తమకు ఒరిగిందేమి లేదని జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాతే గ్రామం అభివృద్ధి చెందిందని, సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు పార్వతి, సర్పంచ్ చందన పవన్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీధర్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, చలపతిరెడ్డి, వినోద్ రెడ్డి, రాఘవ, నితీష్ పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఆదివారం మోతుకులపల్లె, మబ్బువారిపేటలో ఎమ్మెల్యే వెంకటేగౌడ గడపకు గడపకు మన ప్రభుత్వ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివప్రసాద్ తెలిపారు.

చంద్రబాబు చేసింది శూన్యం

కుప్పంరూరల్ : దశాబ్దాలుగా గెలిపించిన కుప్పం నియోజకవర్గానికి చంద్రబాబు చేసింది శూన్యమని స్థానిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ తిమ్మోజీగౌడ్ స్పష్టం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ యువగళం యాత్రకు జనం రాకపోవడంతో లోకేష్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదని మండిపడ్డారు. కుప్పంను మున్సిపాలిటీగా మార్చడం, హంద్రీ-నీవా పనులు ప్రారంభించడం తదితర అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌కే దక్కుతుందని తెలిపారు.

పథకాల అమలుపై క్షేత్రస్థాయిలో పరిశీలన



పథకాల అమలును ఆరా తీస్తున్న కేంద్ర బృందం

సదుం: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును జాతీయ స్థాయి బృందం (ఎన్ఎల్ఎం) సభ్యులు శిశిరకుమార్ సాహు, సత్యబర్త్ బెహ్రా శనివారం పరిశీలించారు. జోగివారిపల్లె సచివాలయంలో మహిళా సంఘ సభ్యులు, పింఛన్, ఉపాధి హామీ పథకం లబ్ధిదారులతో సమావేశమయ్యారు. కంభంవారిపల్లెలో ఎన్ఆర్‌జీఎస్ నిధులతో చేపట్టిన పనులను పరిశీలించారు. మారుతివారిపల్లె ఎస్సీ కాలనీ, గొల్లపల్లెలో గృహ నిర్మాణాలను సందర్శించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ గంగాభవానీ, ఏపీడీ సునీల్‌కుమార్, ఎంపీపీ ఎల్లప్ప, ఎంపీడీఓ వరప్రసాద్, సర్పంచ్ అనితాకుమారి, ఏపీడీ శ్రీనివాసులు, సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

మరింత వేగంగా ఇళ్ల నిర్మాణం



నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సోమల: ఉగాది నాటికి పూర్తి చేసే దిశగా ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అమాస మోహన్ స్పష్టం చేశారు. శనివారం మండల కేంద్రం సమీపంలోని జగనన్న కాలనీని సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ సకాలంలో బిల్లులు మంజూరు చేస్తున్నామని, కాలనీల్లో పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని జాప్యం లేకుండా ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగరాజా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమణయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు వీవీ రమణ, బగ్గిడి నాగరాజా, చక్రపాణి, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్, దివ్యభారతి పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తదితరులు

పుంగనూరు : పట్టణం సమీపంలోని గూడూరుపల్లె వద్ద తీర్చిదిద్దిన జగనన్న కాలనీలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు పనులు ప్రారంభించామన్నారు. కాలనీలో రోడ్లు, కాలువలతోపాటు పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి, లబ్ధిదారులతో త్వరలోనే గృహప్రవేశాలు చేయించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి, కౌన్సిలర్లు నరసింహులు, మనోహర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, రాజేష్, సురేష్, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే అజెండా



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, అధికారులు

- మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం
- పలు అభివృద్ధి పనులకు ఆమోదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర

పలమనేరు : పురపాలక పరిధిలోని సమస్యల పరిష్కారమే అజెండాగా శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ అధ్యక్షతన సమావేశం ప్రారంభం కాగానే కౌన్సిలర్లు ముందుగా పలు సమస్యలను లేవనెత్తారు. కౌండిన్యలోని పంపుహౌస్ వద్ద ఇసుక అక్రమ రవాణాలు అడ్డుకోవాలని కోరారు. ఎద్దుల సంతవీధిలో ఆక్రమణలను అరికట్టాలని కౌన్సిలర్ హైదర్ సూచించారు. బీటీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కౌన్సిలర్ శ్యామ్‌సుందర్‌రాజు డిమాండ్ చేశారు. పట్టణంలో కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ చాన్మాకమాల్ కోరారు. ప్రజలను హడలెత్తిస్తున్న బైక్‌రైడర్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డంపింగ్ యార్డుకు చెత్త తరలిస్తున్న సమయంలో దానిపై టార్పాలిన్ పట్ట కప్పాలని కౌన్సిలర్ శారద సూచించారు. ఈ సమస్యలపై చైర్‌పర్సన్ పవిత్ర, కమిషనర్ కిరణ్‌కుమార్ స్పందించారు. అన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కౌన్సిల్‌లో అజెండా ప్రవేశపెట్టారు. పట్టణంలో అవసరమైన చోట సీసీరోడ్లు, డ్రైన్లు, ఇప్పటికే జరిగిన పనులకు బిల్లుల చెల్లింపులు, ప్లాస్టిక్ బ్యానర్లపై నిషేధం ఉత్తర్వుల అమలు, మున్సిపల్ కరెంట్ బిల్లుల చెల్లింపులు తదితర అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అదే విధంగా డైలీ, వీక్లీమార్కెట్లు, చికెన్, మటన్‌స్టాల్స్, చింతచెట్ల ఫలసాయం, షాపులు, చేపల చెరువుల వేలాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీవీ మహల్ రోడ్డులో తాత్కాలిక షెడ్ల నిర్మాణం, ఈ-సేవ పక్కన ఆరు షాపులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి సోమేశ్వరుని బ్రహ్మోత్సవాలు

కుప్పం : పట్టణంలోని పాతపేటలో ఉన్న ప్రసన్న పార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను ఆదివారం ప్రారంభించనున్నారు. శనివారం ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 10 రోజుల పాటు కొనసాగే ఉత్సవాల్లో స్వామి, అమ్మవార్లు వివిధ వాహనాలను అధిరోహించి భక్తులను కటాక్షించనున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా ఫిబ్రవరి 5వ తేదీన రథోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

రేపటి నుంచి మాగాండ్లపల్లెలో జాతర



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

పుంగనూరు : మండలంలోని మాగాండ్లపల్లెలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు బోయకొండ గంగమ్మ జాతర నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ 30న మండల పూజ, 31న దీపారాధన, ఫిబ్రవరి 1వ తేదీన గంగమ్మ జాతర జరిపించనున్నట్లు వివరించారు.

1న చాముండేశ్వరి ఆలయ ప్రారంభోత్సవం



చాముండేశ్వరి అమ్మవారు

పుంగనూరు : పట్టణంలోని తూర్పుమొగసాలలో నిర్మించిన చాముండేశ్వరి అమ్మవారి ఆలయాన్ని ఫిబ్రవరి 1వ తేదీన ప్రారంభించనున్నట్లు జెట్టి సంఘం ప్రతినిధి హరిజెట్టి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయంలో 1న గోపూజ, గంగపూజతో ప్రారంభమై, 3న వేద పారాయణం, కలశారాధన, రుద్రహోమం, చండీ పారాయణం, 5న ప్రాణప్రతిష్ఠ, హోమం, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు వివరించారు. అగమ అర్చకులు శ్రీనివాసభట్టర్ , ప్రద్యుమ్న రంగరాజ భట్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిపించనున్నట్లు వెల్లడించారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



భూ సర్వేను పరిశీలిస్తున్న డీటీ ప్రకాష్‌బాబు

సోమల: రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని డీటీ ప్రకాష్ బాబు తెలిపారు. శనివారం నెల్లిమంద పంచాయతీలో నిర్వహిస్తున్న రీ సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని వీఆర్‌ఓలు, సర్వేయర్లను ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు సుబ్రమణ్యం, రామచంద్ర పాల్గొన్నారు.

'గోరుముద్ద'పై పర్యవేక్షణ తప్పనిసరి



విద్యార్థినులతో సహపంక్తి భోజనంలో వెంకటరమణారెడ్డి

పలమనేరు : జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరును ఉపాధ్యాయులు తప్పనిసరిగా పర్యవేక్షించాలని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. శనివారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్నభోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి అధికారులు తనిఖీలు రానున్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మిడ్‌మీల్స్ రికార్డులను పరిశీలించారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారి అజయ్‌కుమార్, ఎంఈఓ లీలారాణి పాల్గొన్నారు.

కనమనపల్లెలో 'పొలంబడి'



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నాగరాజు

గుడుపల్లె : మండలంలోని కనమనపల్లెలో వైఎస్సార్ పొలంబడిని శనివారం నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారి నాగరాజు మాట్లాడుతూ రబీలో రైతులు ఆధునిక పద్ధతులతో వరి సాగు చేపట్టాలని సూచించారు. దుక్కి దున్నే సమయంలో సేంద్రియ ఎరువులు వినియోగించుకోవాలన్నారు. మొక్కకు మొక్కకు మధ్య తగు దూరం ఉండేలా చూసుకుంటే పంట నాణ్యంగా వస్తుందని, అధిక దిగుబడి పొందవచ్చని వివరించారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు





స్వామి వారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ స్వామి వారి ఊరేగింపు

బైరెడ్డిపల్లె : మండలంలోని కడపనత్తం నల్లగుండ్రయ్యస్వామి ఆలయం, బైరెడ్డిపల్లె కోదండరామస్వామి, కోట్రేపల్లె కాళభైరవేశ్వరస్వామి, పాతపేటలోని చెన్నకేశవస్వామి, నాగిరెడ్డిపల్లెలోని సోమేశ్వరస్వామి, చీలంపల్లెలోని కపిలేశ్వరస్వామి, పాతురునత్తంలోని రేవణసిద్ధేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం వైభవంగా రథసప్తమి వేడుకలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవదేవులను దర్శించుకున్నారు.అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దేవళంపేటలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని మాడ వీధుల్లో ఊరేగించారు. దిగవమూర్తి వారిపల్లెకు చెందిన మదిరి విజయకుమార్, మదిరి గురుస్వామి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. దేవేంద్రరెడ్డి, మునీశ్వర, రాజారెడ్డి, కోదండయ్య, అర్చకులు అనంతాచార్యులు పాల్గొన్నారు.



దేవళంపేటలో మాడ వీధుల్లో ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

కుప్పంరూరల్ : లక్ష్మీపురం గ్రామంలో వెలిసిన వరదరాజస్వామి ఆలయంలో శనివారం ఘనంగా రథసప్తమి నిర్వహించారు. ఉదయం 6.45 గంటలకు సూర్యప్రభ వాహనం, 8.15 గంటలకు శేషవాహనం, 10 గంటలకు వెండి గరుడ వాహనం,11 గంటలకు హనుమంత వాహనం, 4.30 గంటలకు అశ్వవాహనం, 5.45 గంటలకు సింహవాహనం, 6.45 గంటలకు చంద్రప్రభ వాహన సేవలను చేపట్టారు. భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

రమణీయం.. రథోత్సవం



స్వామివారిని సేవలో ఎంపీపీ రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె : మండలంలోని కార్వేటి కొండపై వెలసిన శ్రీధ్యానాభిరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి రథోత్సవం రమణీయంగా సాగింది. రంగురంగు పుష్పాలతో అలంకరించిన రథంపై సీత సమేత ధ్యానాభిరామస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, సర్పంచులు కృష్ణారెడ్డి, రమణారెడ్డి, దేవేంద్రరెడ్డి, చంద్రమౌళి, ఎంపీటీసీ సభ్యులు రవీంద్రమ్మ, వినాయకం, ఆలయ కమిటీ చైర్మన్ జయరామ్ పాల్గొన్నారు.